# పెళ్ళి కావాలోయ్

అతి కష్టం మీద నాలుగోసారి బియ్యే పూర్తిచేసిన సుబ్బారావుకి అంత కంటె కష్టంమీద భాగ్యనగరం అనబడే రాజధానీ నగరంలో ఉద్యోగం దొరికింది. సుబ్బారావుతండ్రి చనిపోయేటపుడు తనయునికి కొంత ఆస్థిని ఒక తల్లినీ, వీటన్నిటికంటె సమస్యగా కూర్చున్న ఒక బాధ్యతనూ నెత్తిమీద పెట్టి తన బాధ్యతను తీర్చుకున్నాడు. "కూర్చొని తింటే కొండయినా తరుగుతుం"దని పెద్దలు అన్నారు కాబట్టి; పెద్దల మాట మీద కాస్త గౌరవం కల్గిన సుబ్బారావు కాసిని జీతపు రాళ్ళు సంపాదిస్తే కొండను ఎక్కువగా త్రవ్వనక్ఖర లేదనుకున్నాడు. ఈ ఆలోచనతో వుద్యోగాన్వేషణలో సఫలత పొందిన సుబ్బారావుకు కన్యాన్వేషణ గురించి తల్లి పోరు ఎక్కువయింది.

"నువ్వు పెళ్ళి చేసుకొని ఒక యింటివాడవయితే చూడాలని వుందిరా నాయనా!" అంటుంది తల్లి!

"ఏం! పెళ్ళి చేసుకోకపోతే ఒక ఇంటి వాడ్ని కానేమిటి? ప్రస్థుతం నాకు స్వంత ఇల్లుందిగా" అంటాడు "విట్" వేస్తున్న ధోరణిలో సుబ్బారావు.

"ఏమిటోరా నాయనా! నువ్వెప్పుడూ ఇంతే! ఆయనే వుంటే యిలా తయారయ్యేవాడివా!" అనుకొంటూ ముక్కు జిర్రున చీదుకొంటూ కళ్ళు ఒత్తుకొంటుంది.

ఇక ఆదినారాయణాస్త్రం. సుబ్బారావు మెత్తబడి పోతాడు" అదేమిటమ్మా! కల్యాణంవస్తే ఆగిపోతుందా చెప్పు" అని తల్లిని సముదాయిస్తాడు. ఇది ఇంట్లో రోజూ జరిగే మామూలు గొడవే!

అసలు నిజం చెప్పాలంటే సుబ్బారావుకు "పెళ్ళి" అంటే సుతరామూ ఇష్టంలేదు." సంసార సాగరం దుఃఖం" పెళ్ళి ఒక గుదిబండ." ఇత్యాది సామెతలన్నీ విన్న అతనికి; పెళ్ళి అంటే ఒక విధమైన బెదరు పుట్టింది. ఆ మధ్య ఏదో పత్రికలో "పెళ్ళొద్దుబాబోయ్" అన్న వ్యాసంలో "పెళ్ళయితే పడే కష్టాలు" చదివి భయంతో మూడు లంఘనాలు చేశాడు, సుబ్బారావు. పథ్యంతిన్నాక "పెళ్ళొద్దుబాబోయ్!" అని డెబ్భయి ఎనిమిదిసార్లు ఇంపోజిషన్ కూడా వ్రాశాడు. అందుకే తల్లి పెళ్ళిమాట ఎత్తితే మనసు మీద ముళ్ళు గ్రుచ్చుతున్నట్లుంటుంది సుబ్బారావుకి! తన మనసు పెళ్ళికి దూరమవుతున్నకొద్దీ అతనికి తల్లిపోరు ఎక్కువయింది. ఏమిటో ఈ పెద్దవాళ్ళకి పెళ్ళిళ్ళు చూడటం అంటే ఆసక్తి ఎక్కువ!" అనుకున్నాడు సుబ్బారావు. చివరకు తల్లిపోరుపడలేక "ఉద్యోగం వచ్చిన తరువాత చేసుకుంటానులే!" అని

మాట ఇచ్చిన సుబ్బారావుకు వుద్యోగం కాస్తా వచ్చేసి "మరి పెళ్ళిచేసుకో" అని వార్నింగు ఇచ్చింది.

మొదటిసారిగా చిన్న తరహా పల్లెనుంచి పెద్దతరహా పట్టణమైన రాజధానీ నగరం చేరిన సుబ్బారావుకు అక్కడ అన్నీ వింతగానే కన్పించాయి. పబ్లిక్ గార్డెన్సు గురించి ఇతరులు చెప్పుకొంటూ వుంటే విన్న సుబ్బారావు దానిగురించి ఎంతో గొప్పగా ఊహించుకున్నాడు. తీరాచూస్తే మాసిపోయి చివికిపోయిన పాత గుడ్డముక్కల్లా వున్నాయి గార్డెన్సు నవాబు పరిపాలనలో బాగుండేదనీ క్రమేణా దానిస్థాయి తగ్గిపోయిందని మాత్రం తెలుసుకున్నాడు. ఊళ్ళో తిరుగుతున్నప్పుడు ఎక్కడయినా, ఎత్తుగా నాలుగు స్థంభాలు కన్పిస్తే అదే "చార్ మీనార్" అనుకున్న సుబ్బారావు అసలు చార్మినార్ చూశాక మాత్రం కొంచెం ఆశ్చర్య పడిపోయేడు. నగర వీథులు మాత్రం అక్కడక్కడ శుభ్రంగా వున్నందుకు తెగ మెచ్చుకున్నాడు మనస్సులోనే!

దూరపు బంధువు ఒకాయన వుంటే; వాళ్ళ ఇంట్లో దిగి ఉద్యోగంలో చేరిపోయాడు సుబ్బారావు. మూడు రోజులు గడిచి పోయాయ్. సాయంతపు సమయాల్లో చాలా విశేషాలు చూచాడు. కాని యిప్పుడు అతనికి కొత్త సమస్య ఒకటి పట్టుకొంది. ఎక్కడయినా ఒక రూము సంపాదించాలి! ఎంతకాలం ఇలా బంధువుల ఇంట్లో గడపటం?" అని ఉద్యోగాన్వేషణలో కృతకృత్యుడయి, కన్యాన్వేషణ

ఇష్టం లేని సుబ్బారావుకు, గృహాన్వేషణ సమస్య క్రింద తయారయింది.

ఒక ఆదివారం రోజున అద్దె గదికోసం బయలుదేరాడు సుబ్బారావు. మధ్యాహ్నం పన్నెండింటి వరకూ చెమటలు కక్కుకొంటూ తిరిగిన అతనికి ఎట్టకేలకు "ఇస్లామియా బజార్" దగ్గరలో "టులెట్" అన్న బోర్డు కన్పించింది. సుబ్బారావుకి పోయిన ప్రాణం తిరిగొచ్చినట్టయింది. ఇంకా చెప్పాలంటే రెండుకిలోల గోధుమలు దొరికినట్టయింది ఆనందాతిశయంతో ముఖం చింకి చేటంత-బ్లాకులో పంచ దార ధరంత, అయింది. ఇంతవరకూ ఎప్పుడూ అద్దెరూములు అడగటం అలవాటు లేక పోవటంచేత ఒకటికి పదిసార్లు మన సులో "రిహార్సల్స్" వేసుకొని వెళ్ళి మెల్లిగా తలుపుతట్టాడు.

ఒక బామ్మగారు, అచ్చంగా తెలుగు ఆవిడ - వచ్చి తలుపు తీసింది. సుబ్బారావును చూడగానే సిగ్గుతో తల ముసుగు సవరించుకొంది. "నమస్కారం బామ్మగారూ!" అన్నాడు గంగాభాగీరథీ సమానల మీద గౌరవం కలిగిన సుబ్బారావు. బామ్మగారు మరికాస్త సిగ్గుపడిపోయి "లోపలకు రా నాయనా!" అంది ప్రక్కకు తప్పుకొంటూ.

"గదులు ఖాళీగా వున్నాయేమో అని-" నిశ్చయముల్తో లోపలకు ప్రవేశించాడు.

"రా! బాబూ! చూపిస్తాను" అంటూ ఆవిడముందు దారితీసింది.

మేస్టారి వెంట నడిచే కుర్రాడిలా అనుసరించాడు.

ఒక పెద్దగది, చిన్నవరండా, ఒంటిల్లుఖాళీగావున్నాయి. "ఆ పోర్షను" తీసుకొంటే తల్లిని కూడా తీసుకు రావచ్చు నన్న ఆలోచన కల్గింది.

"నాయనా! మీ దేవూరు?" ప్రశ్నించింది బామ్మగారు.

ఫలానా అండి అని సమాధానం చెప్పాడు.

"అద్దె డెబ్భయి రూపాయలు! యిష్టమయితే మీ ఆవిడను వెంటబెట్టుకొని రేపేదిగి పోవచ్చు. రేపు ఏకాదశి, మంచిది కూడా!" అంటూ ముహూర్తం నిర్ణయించి దావిడ!

సుబ్బారావుకి పచ్చి వెలక్కాయ గొంతుకకు అడ్డంపడి నట్లయింది.

"నాకింకా పెళ్ళి కాలేదండి!" అన్నాడు మాట మింగలేక.

మింగేసేటట్టు చూసింది బామ్మగారు. తెల్లని ముసుగుతో వున్న ఆవిడ ముఖం ఎర్రగా ముల్లంగిదుంపలా తయారయింది. "మరి ఆమాటముందే చెప్పకూడదూ వెళ్ళు నాయనా! పెళ్ళయిన వాళ్ళకే ఈఇల్లు ఇవ్వదల్చుకున్నాం"

"బామ్మగారూ నామాట వినండీ! నేను చాలా మంచివాణ్ణి! అమాయకుణ్ణి! మా అమ్మనుకూడా తీసుకువస్తాను.

ఆవిడకూడా మీలాగ బామ్మగారే! మీకు పత్తి బాగుచేసి వత్తులు తయారు చెయ్యటంలో చాలా సహాయపడుతుంది.” అన్నాడు సుబ్బారావు.

బామ్మగారి మనసు కరగలేదు.

“లాభంలేదు” అంటూ నిర్దాక్షిణ్యంగా బయటకుపంపి తనకోపాన్నీ, విసుగునీ తలుపుమీద ప్రయోగించింది ఆ గం. భా. స బామ్మగారు.

ఉసూరుమంటూ బయలుదేరాడు సుబ్బారావు. పడుచుపిల్ల కోపంలా ఎండి మండి పోతోంది. ఇంకో పది నిమిషాలు తిరిగిన తరుతాత ఆ గల్లీలోనే మరొక యిల్లు కన్పించింది. ఒక్కటే గది ఖాళీవుంది. దానికి కూడా ఆ ఇంటాయన బోలెడు నిబంధనలు చెప్పాడు. “ఉదయం ఆరు గంటల లోగా లేచి స్నానంచెయ్యాలి, తరువాత పంపుదగ్గరకు రాకూడదు, ఇంట్లో చాలామంది నారీమణులు వున్నారు కాబట్టి కిటికితలుపులు మూసుకొనే వుంచుకోవాలి, వాళ్ళవైపుకన్నెత్తి చూడకూడదు. అద్దె నలభయి అయిదు రూపాయిలూ ఏనెల కానెల ఎడ్వాన్సుగానే చెల్లించాలి! సాధ్యమైనంతలో, అంటే వారం పదిరోజుల్లో భార్యను తీసుకురావాలి.

“ఎక్కడనుంచి తీసుకురమ్మంటారు? ఎవరి భార్యను తీసుకువస్తే ఎవరొప్పుకుంటారు చెప్పండి” అన్నాడు విసుగ్గా సుబ్బారావు.

“అయితే మీకింకా పెళ్ళికాలేదూ! పిదపకాలం, పిదప

బుద్ధులూను!" అంటూ నోరు రెండుసార్లు నొక్కుకున్నాడాయన. "మేం సంసారులం బాబూ! బ్రహ్మచారులకు ఇవ్వదల్చుకోలేదు"

బ్రహ్మచారులంటే పోకిరీలు. రౌడీలు, గుండాలు; అనే అభిప్రాయాన్ని సూచిస్తూ అన్న ఆయన మాటలు వింటూవుంటే సుబ్బారావు అరికాలిమంట నెత్తికెక్కి, విసవిస నడుచుకుంటూ బయటకు వచ్చేశాడు.

"బ్రహ్మచారులు– వారి మంచితనం" అనే వ్యాసాన్ని వ్రాసి ఏదైనా పేపరుకు పంపించి బ్రహ్మచా.ల గొప్పతనాన్ని ఎత్తి లోకానికి చూపించాలనుకున్నాడు" ఛీ! ఛీ! పాడు లోకం! బ్రహ్మచారులంటే గడ్డిపోచంత కూడా విలువలేదు" అని విసుక్కున్నాడు తనలోనే.

ఆంధ్రబ్యాంకు వీధిలోంచి నడిచి కోఠి చేరుకొని ఎనిమిదవ నెంబరు బస్సుకోసం నిలబడ్డాడు. హైదరాబాద్ ఆర్. టి. సి. బస్సుల్లోని విశేషమేమిటంటే వస్తే ఒకేసారి మందగా వచ్చి నిల్చుంటాయి, లేకపోతే గంట నిరీక్షించినా ఒక్క బస్సూ రాదు. రుమాలుతో చెమట ఒత్తుకుంటూ బస్సుకోసం నిలబడ్డ సుబ్బారావుకి స్వంతవూరి పరిచయస్థుడు ఒకాయన కనబడ్డాడు. ఆయన సుబ్బారావు మొర ఆలకించి "నాయనా! ఒకటవ నెంబరుబస్సు అధిరోహించి నారాయణగూడా పోయినచో ఫలానా నెంబరుగల ఇంటిలో

ఖాళీగా రూముకలదు. అది నీకు దొరుకును, పోయిరమ్ము" అని ఉపదేశించాడు.

వీళ్ళ సంభాషణ విన్న ఒక గళ్ళలుంగీ వ్యక్తి సుబ్బారావును ప్రక్కకు రహస్యంగా పిలిచి "సార్ మీకు రూము కావాలా?" అన్నాడు, విష్ణుమూర్తి భక్తుడికి వరమిచ్చే పోజుల్లో.

సుబ్బారావుకి "మదన్ మోహన్" సంగీతమంటే ఎంత ఇష్టమో; గళ్ళలుంగీ వ్యక్తులంటే అంత భయం. నోటినిండా కిళ్ళీకుక్కుకొని. దర్జాగా లుంగీలుకట్టుకొని పనీపాటా లేకుండా రోడ్లంటతిరిగే గళ్ళలుంగీవాలా లంటే అతనికి అసహ్యాం కూడాను.

తనని ప్రక్కకు తీసుకువెళ్ళి తన దగ్గరవున్న డబ్బు కాస్తా తన్నిలాక్కుంటాడేమోనని భయపడ్డ సుబ్బారావుకు ఆ గ. లు. వాలా మాటలు వినటంతో చెవుల్లో అమృతం వర్షించినట్టు అయింది.

"నువ్వు ఎంతమంచివాడవు బాబూ" అన్నాడు అప్రయత్నంగానే. ఆ మాటలు అన్నతరువాత నాలిక కొరుక్కున్నాడు. ఛా! బొత్తిగా తెలుగు సినిమా డైలాగులా, వుందని.

"మంచి రూమువుంది సార్, "ఫ్లష్ అవుట్ లావెట్రీ" "బాత్ రూమ్" అన్నీ వున్నాయి. చక్కని గాలి వస్తుంది,

మంచి సెంటరులో వుంది. ఆ గదికి రెండు ద్వారాలు, మూడు కిటికీలు..." అని వర్ణించుకు పోతున్నాడు.

"బాబూ! అద్దె ఎంతో- ముందు చెప్పు!" అన్నాడు సుబ్బారావు.

"ఎంతో లేదు సార్ ఏభై రూపాయలు!" ఆ యాభయి రూపాయల్ని యాభై గుడ్డిగవ్వల్లా ఉచ్ఛరిస్తూ అన్నాడు ఆ గ. లు. వాలా.

"ఒక్క గదికి యాభయి రూపాయలు అద్దే!" అన్నాడు ఆశ్చర్యంగా.

"గది చాలా శుభ్రంగా వుంటుంది సార్! నాకు మాత్రం 'పగిడి' వందరూపాయలు! ఇప్పుడు నాతో వస్తే రూము ఇప్పిం చేస్తాను!"

'పగిడీ' అంటే ఏమిటీ? అర్థంకాలేదు సుబ్బారావుకి.

"పగిడీ అంటే డిపోజిట్టా?" అన్నాడు సందేహం తీర్చుకుందామని.

"డిపోజిట్ కాదండి! నాకు బహుమతి అన్నమాట!" అన్నాడు గ. లు. వాలా. సుబ్బారావు నీరుకారి పోయాడు.

రూము అద్దెయాభయి రూపాయలు! అది ఇప్పించినం దుకు వందరూపాయల లంచం! ఉడికెడురూము కోసం ఎన్నికష్టాలు! తనుఉద్యోగం కోసం కూడా వందరూపాయలు క్లర్కుకి లంచం ఇవ్వలేదు." అనుకున్నాడు సుబ్బారావు.

"నా కక్కరలేదు నాయనా!" అంటూ నారాయణ గూడా బస్సుస్టాపుకు చేరుకున్నాడు.

కాశీమజిలీ కథల్లో రాకుమారులు రాక్షసుల ప్రాణాల కోసం అష్టకష్టాలుపడి వెతికినట్లు, ఆశాల్తీ చెప్పిన యింటిని వెదికి పట్టుకున్నాడు. ఆ యిల్లు – ఒక్కముక్కలో చెప్పాలంటే అసలు కొంపలా లేదు. రాళ్ళు, ఇటుకలు, సున్నం, పెంకులు ఇత్యాదులన్నీ కలిసి ఒక గుట్టగా పోసినట్లువుంది. హరప్పాలో బయల్పడిన ప్రాచీన గృహాలను మరిపింప జేస్తున్నాయి. పైకప్పు సినిమాలలో చూపించే శిథిలమైన రోమ్, ఏథెన్సు నగరాలను గుర్తుకుతెస్తోంది. గబ్బిలాల గుహలా వుంది ఆ యిల్లు.

ఎక్కడకు వెళ్ళినా పాతపాటే! ఇల్లు అద్దెతక్కువగానే ఉందికాని, పెళ్ళయితేనే ఇస్తారట లేకపోతే ఇవ్వరట.

"సార్! నేను చాలా మంచి వాడినండీ! కావలిస్తే నాకు కాలేజీ వాళ్ళిచ్చిన "గుడ్ కాండెక్టు సర్టిఫికేట్" పట్టుకొచ్చి చూపిస్తాను!" అన్నాడు సుబ్బారావు.

"నాయనా! అదేం కుదురదు! నాలుగు నెలలక్రితం ఈఇంట్లో నీలాగే ఒక అబ్బాయి అద్దెకు దిగి ప్రక్కయింటి ప్లీడరుగారి అమ్మాయిని లేవదీసుకుపోయాడు. "అందువలన బ్రహ్మచారులకు ఇవ్వదల్చుకోలేదు." అన్నాడాయన నిర్లిప్తంగా.

శిధిలశిల్పం.

కాళ్ళీడ్చుకొంటూ ఇల్లు చేరుకున్నాడు సుబ్బారావు. ఎక్కడకు వెళ్ళినా "మీాకు పెళ్ళయిందా!" అన్నప్రశ్నే! "పెళ్ళికావాలోయ్" అని గట్టిగా అరిచి వెంటనే తల్లికి ఒక ఉత్తరం వ్రాసిపడేశాడు." ఎలాగైనా ఒక సంబంధం చూసి తనకు పెళ్ళిచేసి హైదరాబాద్‌లో ఒక అద్దె ఇంటివాణ్ణి చెయ్యమని!"

★ ★ ★

కథా నిలయం
5292
శ్రీకాకుళం